పోలీసుల త్యాగాలు మరువలేనివి



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జడ్జి, ఎమ్మెల్యేలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : ప్రజల మాన, ప్రాణ, ఆస్తి పరిరక్షణలో పోలీసులు చేసిన త్యాగాలు మరువలేనివని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న అన్నారు. సోమవారం పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయంలో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. సాయుధ బలగాల నుంచి కలెక్టర్, ఎస్పీ, జడ్జిలు శైలజ, రాకేష్, ఎమ్మెల్యేలు గౌరవ వందనం స్వీకరించి ప్రసంగించారు. పోలీసు అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. 2023-24లో దేశవ్యాప్తంగా 216 మంది పోలీసులు అమరులయ్యారని గుర్తుచేసుకున్నారు. ప్రజా సంరక్షణే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ 'మా నాన్న కేరళలో పోలీసు అధికారిగా పనిచేశారు. నేను పోలీసు బిడ్డనే. మీ కుటుంబ సభ్యురాలిని. కష్టాలు, సమస్యలు పరిష్కరించడానికి నా వంతు కృషి చేస్తా..' అని అన్నారు. కలెక్టర్, ఎస్పీ, హిందూపురం జడ్జి శైలజ, పుట్టపర్తి జడ్జి రాకేష్, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, అదనపు ఎస్పీ ఆళ్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, శివన్నారాయణస్వామి, వెంకటేశ్వర్లు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

చెక్కుల అందజేత : కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామని అధైర్య పడకండి, మీకు అండగా పోలీసు శాఖ ఉంటుందని కలెక్టర్, ఎస్పీ పోలీసు అమరవీరుల కుటుంబాలకు భరోసా కల్పించారు. ఏవైనా సమస్యలున్నా, ప్రభుత్వ ప్రయోజనాలు అందకపోయినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులను సన్మానించి, చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐలు వలి, చంద్రశేఖర్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల ఘటనలో పోలీసులకు కీలక సమాచారం!

అదుపులో షికారీపాలెం ముఠా సభ్యుడు

ధర్మవరం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన తుపాకీ కాల్పుల ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాల్పుల ఘటనలో పాల్గొన్న, పరారైన వారిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఘటన అనంతరం పరారైన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా కీలక సమాచారం తెలిసింది. అతను అన్నమయ్య జిల్లా షికారీపాలెం చెందిన బంగారీగా గుర్తించారు. షికారీపాలెం చెందిన ఐదుగురు యువకులు ఓ ముఠాగా ఏర్పడి గుప్తనిధులు దొరికాయని, తమ వద్ద బంగారు నాణేలు ఉన్నాయని, వాటిని తక్కువ ధరకే ఇస్తామని ఎరవేసి, నకిలీ నాణేలు ఇచ్చి నగదు తీసుకుని మోసం చేస్తున్నట్లు విచారణలో తెలిసింది.

బంగారం ముక్క ఎరవేసి..


ఆ ముఠా సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. తక్కువ ధరకే తమ వద్ద ఉన్న బంగారు నాణేలు ఇస్తామని అతనికి వారు చెప్పారు. కదిరికి రప్పించి బంగారు నాణేల కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని ముఠా సభ్యులు బేరం పెట్టారు. నాణేలకు సంబంధించిన కొంత ముక్క ఇచ్చి పరీక్షించుకోవాలని వారు నమ్మబలికారు. దాన్ని తీసుకెళ్లిన హైదరాబాద్ వ్యక్తి మళ్లీ రాకపోవడంతో వారు అతనికి పదే పదే ఫోన్ చేసి రూ.4 లక్షలకే బంగారు నాణేలు అప్పచెబుతామని చెప్పారు. అప్పటికీ అతను ఆసక్తి చూపకపోవడంతో రూ.2 లక్షలకే ఇస్తామని మరోసారి ఫోన్ చేశారు. దీంతో హైదరాబాద్ వాసి తకు ఇచ్చిన బంగారు నాణెం ముక్క పరీక్ష చేయించగా అసలు బంగారమని తేలింది.


కాల్పులు హైదరాబాద్ ప్రాంత వాసుల పనే..?

హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి తనకు తెలిసిన కొందరు నగర సైబర్ క్రైం పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. నకిలీ బంగారు నాణేలు కట్టబెట్టి డబ్బు తీసుకెళ్లేందుకు షికారీపాలెం ముఠా పథకం వేసిందనే విషయాన్ని అతనికి వారు అవగాహన కల్పించారు. హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల్లో పలువురు ఆ ముఠా సభ్యుల చేతుల్లో మోసపోయినట్లు తెలిసింది. ఒప్పందం కుదుర్చుకున్న మేరకు హైదరాబాద్ వ్యక్తికి బంగారు నాణేలు ఇచ్చేందుకు ఆదివారం ముఠా సభ్యులు బత్తలపల్లి మండలం రామాపురం వద్దకు వచ్చారు. కారులో వచ్చిన హైదరాబాద్ వ్యక్తి ముఠా సభ్యులతో మాట్లాడుతుండగా మరో వాహనంలో వచ్చిన, హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు తుపాకులు బయటకు తీసి గాల్లో కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు పట్టుకునేందుకు వచ్చారని ముఠా సభ్యులు ద్విచక్ర వాహనాల్లో తప్పించుకెళ్లారు. ఈ దశలో వారు తమ వద్ద ఉన్న నకిలీ బంగారు నాణేల సంచి పడేసి వెళ్లారు. వారి నుంచి తప్పించుకునే క్రమంలో ముఠా సభ్యుడు బంగారీ వ్యవసాయ పొలాలను దాటుకుని బత్తలపల్లి వైపు వెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామాపురం కాల్పుల ఘటనపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులతోనూ శ్రీసత్యసాయి జిల్లా పోలీసు అధికారులు మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన పోలీసులు షికారీపాలెం ముఠాను పట్టుకునేందుకు వచ్చినట్లు ప్రాథమికంగా తెలిసింది. పట్టుబడిన బంగారీ నుంచి వివరాలు రాబడుతున్నామని ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు పేర్కొన్నారు.

ప్రభుత్వ బడుల్లో

- మంజూరుకు నోచుకోని గ్రాంటు
- ప్రధానోపాధ్యాయులపై భారం





నిధులకు నిరీక్షణ

'అనంతపురం గ్రామీణ మండలంలో 125 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 89 ప్రాథమిక, 14 ప్రాథమికోన్నత, 24 ఉన్నత పాఠశాలలున్నాయి. సుమారు 18 వేల మంది విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చదువుతున్నారు. అన్ని పాఠశాలలకు కలిపి ఏడాదికి రూ.23 లక్షల గ్రాంటు మంజూరు కావాలి. రెండేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులపై భారం పడుతోంది.'

'శ్రీసత్యసాయి జిల్లాలోని కొత్తచెరువు మండలంలో 45 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. వాటిలో ప్రాథమిక 34, ప్రాథమికోన్నత 4, ఉన్నత పాఠశాలలు 7 ఉన్నాయి. వీటికి గ్రాంటు మంజూరు కాకపోవడంతో సుద్దముక్కలు కొనడానికి కూడా ఇబ్బందిగా మారింది.'

ఎస్కేయూ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేసింది. నాడు-నేడు పథకానికి అరకొరగా నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకొంది. నాడు-నేడు పథకానికే కాకుండా పాఠశాల నిర్వహణకు కూడా ప్రతి సంవత్సరం నిధులు విడుదల చేయాలి. ఆ దశగా వైకాపా ప్రభుత్వం ఆలోచించలేదు. దీంతో పాఠశాల నిర్వహణ భారం ప్రధానోపాధ్యాయులపై పడుతోంది. వాస్తవానికి పాఠశాలల్లో సుద్దముక్కలు, బోర్డు తుడుపుగుడ్డలు, తెల్లకాగితాలు, రిజిస్ట్రర్లు తదితర స్టేషనరీ కొనుగోలుకు పాఠశాల గ్రాంటు ప్రభుత్వం విడుదల చేస్తుంది. 100 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు రూ.10 వేలు, 100 నుంచి 250 మధ్య ఉంటే రూ.25 వేలు, 500 మంది విద్యార్థులుంటే రూ.50 వేలు, వెయ్యికి లోపుంటే రూ.75 వేలు, వెయ్యి దాటితో రూ.లక్ష చొప్పున ఈ గ్రాంటు మంజూరు చేయాలి. మూడేళ్ల నుంచి నిధులు రాకపోవడంతో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏడాదికి రూ.లక్ష చొప్పున ఖర్చు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రధానోపాధ్యాయులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



చదువుకుంటున్న విద్యార్థులు

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి అనంత జిల్లాలో 2023-24, 2024-25 సంవత్సరంలో ఒక్క రూపాయి కూడా పాఠశాల గ్రాంటు రాలేదు. 2022-23లో కేవలం 25 శాతం నిధులు వచ్చాయి. సుమారు రూ.6 కోట్ల నిధులు ఉమ్మడి జిల్లాకు ఏటా విడుదల కావాల్సి ఉంది. పాఠశాలల్లో పెద్ద పెద్ద మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. 25 శాతం మొదటి విడతలో విడుదల చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ నిధులపై స్పష్టత రావాల్సి ఉంది.

నేరుగా బడులకే పంపిస్తాం

- నాగరాజు, ఏసీపీ, సమగ్రశిక్షా, అనంతపురం

రెండేళ్ల ముందు 25 శాతం నిధులు వచ్చాయి. ఆ తరువాత నిధులు రాలేదు. ఈ సంవత్సరం నిధులు మంజూరవుతున్నట్లు తెలిసింది. రాష్ట్రవిద్యాశాఖ నుంచి నేరుగా పాఠశాలలకు ఆన్‌లైన్‌లో నిధులు విడుదల చేస్తారు. లేదా ఎస్ఎస్ఏ కార్యాలయానికి నిధులు వస్తే వెంటనే ప్రధానోపాధ్యాయుల ఖాతాకు పంపిస్తాం.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే : ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని నిర్ణీత గడవులోపు పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్‌తో పాటు, జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్‌డీఓ సువర్ణ ప్రజల నుంచి 248 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదులను పరిశీలించి రీఓపెన్ కాకుండా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఏ కారణం చేత పరిష్కారం కాలేదనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

త్వరలో మండల స్థాయిలో సమావేశాలు : త్వరలో ప్రతి మండల స్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. అందుకు సంబంధిత జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులందరూ సమగ్ర ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, నాయకులు

పని చేసేవారికే తెదేపాలో గుర్తింపు

కదిరి, న్యూస్‌టుడే : తెదేపా ప్రతిష్ఠను చాటేలా పార్టీ సభ్యత్వ నమోదు జరగాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కదిరిలోని పీవీఆర్ ఫంక్షన్‌హాలులో తెదేపా సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కార్యకర్తలను కుటుంబ సభ్యుల్లా భావించే ఏకైక పార్టీ తెదేపాయేనన్నారు. పార్టీ సభ్యత్వం కలిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల బీమా అందిస్తారన్నారు. సభ్యత్వాలను బూత్‌స్థాయిలో కుల, మతాల వారీగా తగిన సంఖ్యలో నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారికే గుర్తింపు, గౌరవం ఉంటాయన్నారు. పార్టీ బాగుంటే అందరూ బాగుంటామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీన్‌బాను, అహ్మద్‌అలి, రాజశేఖర్‌బాబు, చంద్రశేఖర్, మనోహర్‌నాయుడు, ఇర్ఫాన్, బహుద్దీన్, కౌన్సిలర్లు ఫయాజ్, సావిత్రమ్మ, మహబూబ్‌బాషా, మండల కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

పురపాలిక స్థలం కబ్జా

షెడ్లు వేసిన వైకాపా కౌన్సిలర్లు



తిమ్మాపురంలోని పాతజాతీయ రహదారి పక్కన వైకాపా కౌన్సిలర్లు వేసిన షెడ్లు

పెనుకొండ, న్యూస్‌టుడే: వైకాపా కౌన్సిలర్లు, నాయకులు 36సెంట్ల ప్రభుత్వ స్థలం కాజేసేందుకు వేసిన షెడ్లను తొలగించకుండా అధికారులు పాలకులు చోద్యం చూస్తున్నారు. పెనుకొండ నగరపంచయాతీ పరిధిలోని 2వ వార్డులోని తిమ్మాపురంలో ఇందిరమ్మ కాలనీకి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంపై కన్నేసిన కౌన్సిలర్లు, నాడు అధికారం అండతో దాదాపు రూ.3.6కోట్లు విలువ చేసే 36సెంట్ల స్థలం కాజేసేందుకు 24 షెడ్లు జనవరిలో నిర్మించేందకు సిద్ధమయ్యారు. వెంటనే 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించడంతో షెడ్ల నిర్మాణ పనులు నిలిపేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాటిని ఆ తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలు గడుస్తున్నా అక్రమంగా వేసిన షెడ్లు తొలగించకపోవడం శోచనీయం. నగరపంచాయతీ ఆదాయానికి అడ్డంకిగా ఉన్న షెడ్లను తొలగించి, పంచాయతీకి ఆదాయ వనరుగా మార్చడంతో పాటు పది మంది చిరువ్యాపారులకు ఉపాధి కల్పించే విధంగా వ్యాపార సముదాయం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈషెడ్ల నిర్మాణం కారణంగా ఇందిరమ్మకాలనీలోని 175 నివాస గృహాల నుంచి వచ్చే వృథా నీళ్లు వెళ్లే కల్వర్టు మేసివేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటుచేసిన షెడ్లను తొలగించి కాలనీలోని మురుగు నీరు కల్వర్టు ద్వారా బయటకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

పరిశీలించి చర్యలు చేపడతాం

-శ్రీనివాసులు, కమిషనర్, పెనుకొండ

షెడ్ల నిర్మాణానికి సంబంధించి పూర్తి పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలం ఏ శాఖ పరిధిలో ఉందో తెలుసుకుని, ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పిస్తాం. అనుమతుల్లేకుండా వేసిన షెడ్లను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. కాలనీలో మురుగు సమస్యను పరిష్కరిస్తాం.

రైల్వే రోడ్ విస్తరణపై అపోహలు వీడండి

భవనాల తొలగింపు 70 అడుగులకే పరిమితం

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: రైల్వే రోడ్ భవన యజమానులు అపోహలు వీడాలని, గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారమే 70 అడుగులకే రహదారి విస్తరణ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సోమవారం స్థలాలు కోల్పోతున్న బాధితుల తరపున వచ్చిన నాయకులతో పుర కార్యాలయంలో చర్చించారు. స్థలాలు కోల్పోతున్న వారిపట్ల తమకు సానుభూతి ఉందని, ఎక్కడైనా సిబ్బంది పొరపాటున 70 అడుగులకు మించి తొలగించి ఉంటే వాటిని సరిదిద్దుతామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో మాత్రమే 100 అడుగుల విస్తీర్ణంతో కూడలి ఉంటుందని, మిగిలిన చోట్ల 70 అడుగులకు మించి ఉండదని ప్రకటించారు. ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. చర్చల్లో పాల్గొన్న తెదేపా మున్సిపల్ పక్ష నాయకుడు, కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ అనవసర ఆందోళనలు వద్దని, రహదారి విస్తరణకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హయాంలో ఎవరికీ అన్యాయం జరగదని తెలిపారు. భవనాల తొలగింపులు పూర్తయిన వెంటనే, రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపడతామని, అనంతరం రహదారిని సుందరంగా నిర్మిస్తామని, మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి మొక్కలు నాటడంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని వివరించారు. తెదేపా సీనియర్ నాయకులు జేఈ వెంకటస్వామి, పలువురు కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



వచ్చిన నాయకులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

జిల్లా అంతటా మోస్తరు వర్షం

పుట్టపర్తి, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా అమడగూరు 56.6, అత్యల్పంగా బుక్కపట్నం 1.4 మి.మీ. వర్షం పడింది. సోమవారం కూడా పలుచోట్ల వర్షం కురిసింది. తనకల్లులో 50.4, లేపాక్షిలో 28.4, గుడిబండ 21.2, పుట్టపర్తి 10.8, అగళి 8.6, ఎన్‌పీ కుంట 8.4, గాండ్లపెంట 8.2, చిలమత్తూరు 7.8, ఓడీసీ 6.2, మడకశిర 5.0, అమరాపురం 4.6, సీకే పల్లి 4.4, నల్లమాడ 3.2, పెనుకొండ 3.2, నల్లచెరువు 2.8, తాడిమర్రి 2.6, తలుపుల 2.4, కదిరి 2.0, కొత్తచెరువు 2.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

పుట్టపర్తి, న్యూస్‌టుడే : జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు గెజిట్ నోటిఫికేషన్‌ను సోమవారం కలెక్టర్ టీఎస్ చేతన్ విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిందన్నారు. జిల్లాలో చిన్నతరహా నీటిపారుదల సంఘాలు 214, మధ్యస్త సంఘాలు 16 ఉన్నాయని తెలిపారు. నవంబరు 21 నుంచి 23వ తేదీ వరకు ఎన్నికలు జరుగుతాయని, పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రాధాకృష్ణ, డీఈ గంగాద్రి, ఏఈఈ జుమానాబాయి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక : ఆర్‌డీఓ

ధర్మవరం, న్యూస్‌టుడే : గృహ నిర్మాణదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తోందని తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలలోని చిన్నచిగుళ్లరేవు, పెద్దచిగుళ్లరేవు ఇసుక రీచ్‌ల నుంచి ట్రాక్టర్లలో ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చని ధర్మవరం ఆర్‌డీఓ మహేశ్ తెలిపారు. ఇది వరకు ఎడ్లబండ్లలో తీసుకెళ్లే అవకాశం ఉండేదని, ఇప్పుడు ట్రాక్టర్లలోనూ తీసుకెళ్లొచ్చన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తీసుకెళ్లాలన్నారు. టిప్పర్లలో తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ఇళ్ల నిర్మాణం పేరిట ఎవరైనా ట్రాక్టర్లలో తీసుకెళ్లి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తగా 8 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ధర్మవరం నియోజకవర్గంలో కొత్తగా 8 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఆర్‌డీఓ మహేశ్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఇదివరకు 287 పోలింగ్ కేంద్రాలు వుండేవి. వాటి సంఖ్య 295కు పెరిగిందని ఆర్‌డీఓ తెలిపారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందన్నారు. తాడిమర్రి మండలం మర్రిమాకులపల్లిలో రెండు పోలింగ్ కేంద్రాలు, చిన్నచిగుళ్లరేవులో 1, ముదిగుబ్బ మండలం పెద్దచిగుళ్లరేవులో 1, ధర్మవరం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 1, పార్థసారథినగర్‌లో 1, వైఎస్ఆర్ కాలనీలో 1, కేతిరెడ్డి కాలనీలో 1 చొప్పున కేంద్రాలు కొత్తగా ఏర్పాటు అయ్యాయన్నారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షులు జింకా చంద్రశేఖర్, సాకే ఓబులేశు, వైకాపా నాయకుడు గుర్రం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రయ విక్రయాలేవీ?

పేరుకే మార్కెట్ యార్డులు



కొత్తచెరువులో 15 ఎకరాల విస్తీర్ణంలో యార్డు ఉంది. గోదాములు నిర్మించారు. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ఊసే లేదు. ప్రతి బుధవారం జీవాల సంత నిర్వహిస్తున్నారు. ఏటా రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. ఆదాయం సిబ్బంది జీతాలకే అన్నట్లు మారింది.

కదిరి, కొత్తచెరువు, న్యూస్‌టుడే

రైతులు పండించిన ఉత్పత్తులను ఆరబెట్టడం, నిల్వ చేసుకోవటం, గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు మార్కెట్ యార్డులను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణకు సిబ్బందిని నియమించారు. లక్ష్యానికి అనుగుణంగా యార్డులకు వ్యవసాయ ఉత్పత్తులు రావటం లేదు. దీంతో కేవలం జీవాల క్రయవిక్రయాల నిర్వహణ మాత్రమే సాగుతోంది. వారానికి ఒకరోజు జరిగే సంతలతో ఆదాయం వస్తున్నా నిర్వహణ, సిబ్బంది జీతాలకే యార్డులన్న భావన వ్యక్తమవుతోంది. రైతుల్లో చాలా మంది ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు వ్యయప్రయాసలతో కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. గిట్టుబాటు ధర లభించక, తూకాల్లోనూ మోసపోతున్నారు.

జిల్లా:
శ్రీసత్యసాయి
మార్కెట్ యార్డులు: 8
2023-24లో ఆదాయం: రూ.4.98 కోట్లు



కదిరి మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగడం లేదు. డివిజన్ పరిధిలో వేరుసెనగతో పాటు ఇతర పంటలను పండిస్తున్నారు. చింతపండు వ్యాపారం బాగా జరుగుతుంది. ఆ ఉత్పత్తులు యార్డుకు వస్తున్న దాఖలాలు లేవు. ప్రతి మంగళవారం గొర్రెలు, మేకల సంత మాత్రమే నిర్వహిస్తున్నారు. ఏటా రూ.84 లక్షల ఆదాయం సమకూరుతోంది. యార్డు అందుబాటులో ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగంలో లేదు.

అవగాహన కల్పిస్తున్నాం..

- నరసింహమూర్తి, ఏడీ, మార్కెటింగ్ శాఖ

రైతులు పండించిన పంటలను మార్కెట్‌యార్డులకు తెచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి కలిగిన రైతులు యార్డుల్లోని గోదాముల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు. ఈ ఏడాది నుంచి వేరుసెనగ విక్రయాలను మార్కెట్ యార్డులలో క్రయవిక్రయాలు సాగేలా చర్యలు తీసుకుంటాం. హిందూపురం, కదిరిలలో మిరప, చింతపండు, ధర్మవరంలో వేరుసెనగ క్రయవిక్రయాలు సాగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

ఐదేళ్లలో తాగునీటి పథకాలన్నీ నిర్వీర్యం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజం

ఉరవకొండ, న్యూస్‌టుడే : ఐదేళ్లల్లో వైకాపా ప్రభుత్వం పీఏబీఆర్ వద్ద ఉన్న తాగునీటి పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. నీటి పథకాల విషయంలో దుర్మార్గాన్ని ప్రదర్శించిందన్నారు. సోమవారం ఆయన కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద శ్రీరామరెడ్డి, కూడేరు, ఉరవకొండ తాగునీటి పథకాలను జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఉరవకొండ మండలం ఇంద్రావతి హంద్రీనీవా కాలువ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండ తాగునీటి పథకానికి సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల నుంచి నీరు సరఫరా అవుతోందన్నారు. సత్యసాయి పథకంలో రెండు మోటార్లకు ఒకటి, శ్రీరామరెడ్డి పథకంలో రెండు మోటార్లకు గాను రెండు పని చేయడం లేదన్నారు. కూడేరు పథకంలోని మోటారు ద్వారా నీటిని అందిస్తున్నారన్నారు. వీటితో పాటు కొంత మేర పైపులైన్లు, రాపిడ్ శాండ్ ఫిల్టర్‌లో ఇసుక పాడయ్యిందన్నారు. విద్యుత్తు నియంత్రికలు, మోటార్ల వద్ద విద్యుత్తు పరికరాలను, శుద్ధి జరిగిన నీటిని తోడే ప్రదేశంలో 1000 హెచ్‌పీ మోటార్‌ను, ఫిల్టర్ బెడ్‌లను మార్చాల్సి ఉందన్నారు. ఉరవకొండకు ఐదేళ్లుగా కలుషిత నీటినే సరఫరా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మోటార్లను మార్చడంతో పాటు, ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభిస్తామన్నారు.



పీఏబీఆర్‌లో పనిచేయని మోటార్ల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి పయ్యావుల కేశవ్

మెలకువలతో నాణ్యమైన బోధన అందించండి: ఆర్జేడీ

ఎస్సీయా, న్యూస్‌టుడే: శిక్షణలో నేర్చుకున్న మెలకువలతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు (ఆర్జేడీ) శామ్యూల్ పేర్కొన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల ప్రాథమిక ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావాల్సిందేనన్నారు. 6 రోజులపాటు జరిగే శిక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. తెలుగుభాషను యోగాతో శిక్షణ కార్యక్రమం ఆరంభమవుతుందన్నారు. వ్యక్తిత్వ వికాసంతో పాటు, విద్యార్థులతో ఎలా మెలగాలి, ఏ విధంగా బోధించాలనే విషయాలను నిపుణులు వివరిస్తున్నారు. బోధనకు అన్నివిధాలుగా తీర్చిదిద్దుతారన్నారు. నేర్చుకున్న అంశాలు పాఠశాలలో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు మల్లికార్జున, ఏపీసీ నాగరాజు, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు సీఎం కృషి

రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ - 17 వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర, ఏపీ శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు తదితరులు, తలపడుతున్న క్రీడాకారులు

హిందూపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా మైదానాలు, శిక్షణ కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చి రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర పేర్కొన్నారు. సోమవారం హిందూపురం పట్టణం ముద్దిరెడ్డిపల్లిలో 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్ 17 వాలీబాల్ పోటీలను రాష్ట్ర శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడుతో కలిసి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం 13 జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొన్న బాల, బాలికల జట్లు నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సతీమణి, ఏపీ శ్యాప్ ఛైర్మన్ మాట్లాడుతూ అవసరమైన శిక్షకులను ఏర్పాటుచేసి ప్రభుత్వం క్రీడలపట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తోందన్నారు. 2027లో రాష్ట్రంలో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించే దిశగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకొంటున్నారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితో ముద్దిరెడ్డిపల్లిలో క్రీడా మైదానం మంజూరు చేశారన్నారు. ఎంజీఎం పాఠశాలలో అర్ధంతరంగా ఆగిన ఇండోర్ స్టేడియం పూర్తికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. డీఎస్‌డీఓ ప్రభుకుమార్, సుమిత్ర, ఎంఈవో ఏహెచ్ గంగప్ప, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ బాలమురళి, పరిశీలకుడు రమణ, ఎస్‌జీఎఫ్ మొదర్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేశ్, జిల్లా తెదేపా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజే హోరాహోరీగా..

అనంతపురం- కర్నూలు బాలుర జట్లు తలపడగా అనంతపురం విజయం సాధించింది. నెల్లూరు, చిత్తూరు బాలుర జట్లమధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు గెలవగా బాలికల విభాగంలో శ్రీకాకుళం, చిత్తూరు జట్లు తలపడగా చిత్తూరు గెలుపొందింది.

పాడి రైతులకు కూటమి సర్కారు అండ

పశు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరుకు శ్రీకారం



దామోదర్‌రెడ్డి, పాడి రైతు, ఆర్.కొత్తపల్లి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పాడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఈ కార్డుతో రుణాలు పొంది పశువులను, దాణా, మేత, మందులు కొనుగోలు చేయవచ్చు. రైతుల అవసరాలకు సకాలంలో చేతిలో డబ్బు ఉండదు. అధిక వడ్డీలకు బయట తీసుకోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవటానికి ప్రభుత్వం కార్డుల మంజూరుకు చర్యలు తీసుకొంది. జిల్లాలో 5వేల మందికి ఈ కార్డులు మంజూరు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. గతంలోనే ఈ పథకం ఉన్నా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు తీసుకున్నా బ్యాంకర్లు కొంత మందికే కార్డులు మంజూరు చేసి మమ అనిపించారు.

ఇవి ప్రయోజనాలు: పంట రుణం తీసుకున్న రైతులకే బ్యాంకర్లు కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తారు. పాడిరైతు పశువైద్యాధికారి గుర్తింపు పత్రాన్ని బ్యాంకరుకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కార్డు ద్వారా గరిష్ఠంగా రూ.3లక్షల దాకా రుణం మంజూరు చేస్తారు. రూ.1.60లక్షల దాకా ఎలాంటి పూచీకత్తు అవసరం ఉండదు. రుణాన్ని 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే 7శాతం వడ్డీ మాఫీ చేస్తారు. ఏడాదిలోపు క్రమం తప్పకుండా చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా చెరో 3 శాతం చొప్పున వడ్డీ రాయితీ ఇస్తాయి. మిగిలిన ఒక శాతం రైతులు చెల్లిస్తే సరిపోతుంది. కార్డుల కోసం పాడిరైతులు దరఖాస్తులు చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు జి.పి.వెంకటస్వామి తెలిపారు.

జిల్లాలో పశు సంపద వివరాలు (లక్షల్లో)

ఆవులు	2.16
గేదెలు	1.90
గొర్రెలు	22.94
మేకలు	4.12
పశువులు	5.27

సమస్య-సమాధానం



నజీరుద్దీన్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రబీ పంటల సాగులో రైతులకు ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త నజీరుద్దీన్ 99665 05285 నంబరుకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

సమస్య: మిరప తోటకు ఆకుముడత తెగులు సోకింది. నివారణ ఎలాంటి చర్యలు తీసుకోవాలి. - నాగరాజు(రెడ్డిపల్లి)

సమాధానం: ఎకరా ప్రొఫినోల్ 400 మి.లీ లేదా డైఫెంథియూరాన్ 300 గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగులు ఉద్ధృతిని అరికట్టవచ్చు.

సమస్య: ఎకరా విస్తీర్ణంలో కాకర పంటను సాగు చేశా. పంటకు బూజు తెగులు ఆశించి ఆకులు ముడుచుకుపోతున్నాయి. నివారణ చర్యలు తెలుపండి. - శంకరయ్య(బి.పప్పూరు)

సమాధానం: కాకర పంటలో బూజు తెగులు నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ మందును 2 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.



టమాటా రైతు పంట పండింది

కర్ణాటక మార్కెట్‌కు తరలింపు

రైతేరాజు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: కదిరి మండలంలోని వీరేపల్లిపేటకు చెందిన రైతు వెంగమునిరెడ్డి టమాట పంట సాగు చేసి రూ.14లక్షల వరకు ఆర్జించారు. తనకున్న 12 ఎకరాల్లో 6ఎకరాలు అరటి, ఒకటిన్నర ఎకరాలో టమాటా పంట సాగు చేశారు. గత జులైలో ముదిగుబ్బలోని నర్సరీ నుంచి సాహో రకానికి చెందిన 14వేల టమాటా మొక్కలను ఒక్కోటి 80పైసలతో కొని తెచ్చి నాటారు. వర్షాలకు పొలంలో నీరు నిలిచినా కాయ దెబ్బతినకుండా కట్టెల సాయంతో తీగ కట్టించారు. మొక్కలు నాటినప్పట్నుంచి తెల్ల దోమ, కాండం తెగుళ్లు, నల్లమచ్చ, ఆకుముడత, ఎర్రనల్లి, కాయ కుళ్లు తెగుళ్లు వ్యాపించాయి. ఉద్యాన అధికారుల సూచనలతో నిత్యం మందులు పిచికారీ చేశారు. డ్రిప్పు ద్వారా మందులు వదిలి తెగుళ్లను అరికట్టారు. రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అందులో ఎరువులు, మందులకే సుమారు రూ.2లక్షలు ఖర్చయ్యింది.



దిగుబడి చూపుతున్న రైతు వెంగమునిరెడ్డి

పంట సాగు చేసిన రెండున్నర నెలలకు కోతకొచ్చింది. మొదటి కోతలో 200పెట్టెలు(ఒక పెట్టె 15కిలోలు) వచ్చాయి. రెండో కోతలో 300, మూడో కోతలో 500 పెట్టెల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు 12కోతలకుగాను 4,000 పెట్టెల దిగుబడి వచ్చింది. టమాటాలను కర్ణాటకలోని చింతామని మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించారు. అత్యధికంగా ఒక పెట్టె రూ.1100 నుంచి అత్యల్పంగా రూ.700 వరకు ధరలు పలికాయి. మొత్తం రూ.18లక్షలు రాబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చులుపోనూ రూ.14 లక్షలు మిగిలాయి. ఇంకా 10 కోతలు వస్తాయని, ధరలు బాగుంటే మరో రూ.2 లక్షల వరకు లాభం రావచ్చని రైతు చెబుతున్నారు.

లిల్లీ పూల సాగుతో రోజూ ఆదాయమే



పూలు కోస్తున్న కూలీలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన ఉమేష్, రమేష్ అనే అన్నదమ్ములు లిల్లీ పూలు సాగు చేస్తూ రోజూ ఆదాయం పొందుతున్నారు. ఇద్దరికి నాలుగు ఎకరాల పొలం ఉంది. నాలుగు నెలల కిందట చెరో ఎకరా విస్తీర్ణంలో లిల్లీ పూలు సాగు చేశారు. పూల గడ్డలను జీడిపల్లిలోని ఓ రైతు నుంచి గంప రూ.300 చొప్పున 50 గంపలు తెచ్చి నాటారు. పురుగు మందుల పిచికారీకి నెలకు రూ.5వేలు ఖర్చు చేస్తున్నారు. మొక్కలకు పశువులు, గొర్రెల ఎరువులు వేస్తున్నారు. పొలంలో ఎప్పటికప్పుడు కలుపు తొలగించడంతో పంట ఆశాజనకంగా ఉంది. నెల రోజుల నుంచి పూల దిగుబడి వస్తుంది. ఎకరాకు రోజూ 10 కిలోల చొప్పున వస్తున్నాయని, మార్కెట్లో కిలో ధర రూ.70 పలుకుతున్నట్లు రైతులు చెప్పారు. ఏడాది దాటితే రోజూ 50-80 కిలోల వరకు పూలు వస్తాయని చెబుతున్నారు. పంట కాలం 4-6 ఏళ్ల పాటు ఉంటుంది.

అరటిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

చిట్కా

జిల్లాలో రైతులు సాగు చేస్తున్న అరటి పంటలో అధిక దిగుబడి సాధించాలంటే తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. ప్రతి మొక్కకూ 80 గ్రాముల పొటాష్ ఎరువు వేసుకుంటే ఆకులు పసుపు రంగులోకి మారకుండా కాపాడుకోవచ్చన్నారు. తద్వారా గెల నాణ్యత పెరుగుతుందన్నారు. పంటలో జింకు లోపం కనిపిస్తే వెంటనే మొక్కల మొదళ్లలో 10 గ్రాముల జింక్ సల్ఫేట్ వేసుకోవాలన్నారు. గంధకం, బోరాన్ మిశ్రమాలు సమపాళ్లలో వేసుకోవడం ద్వారా మొక్కలు ఏపుగా పెరిగి కాయ నాణ్యతగా ఉంటుందని శాస్త్రవేత్త తెలిపారు.

- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం



సూక్ష్మపోషకాలు లోపించిన అరటి మొక్క

వైకాపా భూ ఆక్రమణలకు హద్దే లేదు: పరిటాల సునీత



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆర్డీఓ

రామగిరి, న్యూస్‌టుడే: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలకు హద్దే లేకుండాపోయిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం రామగిరి మండల కేంద్రంలో సోమవారం రెవెన్యూ సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ధర్మవరం ఆర్డీఓ మహేష్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ నరేష్‌బాబు, మండల రెవెన్యూ అధికారులతో కలసి ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి 185 వినతులు వచ్చాయి. వీటిలో అధిక సంఖ్యలో వైకాపా ప్రభుత్వ బాధితులు ఉన్నట్లు తెలిపారు.

నీటి ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ ధ్వజం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, చిత్రంలో సీనియర్ నాయకుడు ఓబులు, జిల్లా కార్యదర్శి రాంభూపాల్ తదితరులు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: సీమ జిల్లాల సాగునీటి ప్రాజెక్టులపై అనాది కాలం నుంచి పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వారి స్వార్థపూరిత రాజకీయాల మూలంగా అన్నదాతలు అన్యాయం అవుతున్నారు. కరవు ప్రాంతాలు సస్యశ్యామలం కావాలంటే తుంగభద్ర, కృష్ణా జలాలే 'ఏకైక మార్గం' అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. 'నీటి వనరులు.. ఆయకట్టు రైతుల వ్యథలు'పై అధ్యయనం చేసేందుకు ఈనెల 15 నుంచి 19వ తేదీ దాకా సీపీఎం ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించారు. ఆఖరుగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గఫూర్ మాట్లాడుతూ ఈ ప్రాంత నాయకులు అనేకమంది సీఎంలైనా న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. ఏ పార్టీ ప్రభుత్వం అన్నది కాదక్కిడ. ప్రతి ప్రభుత్వం సీమ జిల్లాలపై తగిన శ్రద్ధ చూపలేదన్నారు. సీపీఎం రాష్ట్ర నేత ఓబులు మాట్లాడుతూ 2008లో హెచ్చెల్సీ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టినా ఇప్పటికీ అతీగతీలేదు. పాలకుల వైఖరి, వారి స్వార్థ రాజకీయాలే దీనికి కారణమన్నారు. జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువల ఆధునికీకరణతోపాటు ఉంతకల్లు జలాశయం, పీఏబీఆర్, ఎంపీఆర్, చాగల్లు, పేరూరు, భైరవానితిప్ప, సుబ్బరాయసాగర్.. వంటి జలాశయాలను ఆధునికీకరించాలన్నారు. ప్రతి చెరువుకు నీరు ఇవ్వాలని డిమాండు చేశారు. ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, బాలరంగయ్య, సావిత్రి, నాగేంద్ర, శ్రీనివాసులు, రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు మాట్లాడారు. అంతకముందు నగరంలో ర్యాలీ జరిపారు. ఆఖరుకుగా కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి అందజేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఖుష్బు కొఠారి తెలిపారు. ముందుగా ఈనెల 21వ తేదీ వరకు గడువు విధించగా విద్యార్థుల సౌకర్యం కోసం మరో అవకాశం కల్పించామన్నారు. అర్హులైనవారు జ్ఞానభూమి వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

కొడిగెనహళ్లి (పరిగి): విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని అనంతపురం ఎస్కే యూనివర్శిటీ అటల్ ఇంకుబేషన్ సెంటర్ సీఈవో డా.చంద్రమౌళి పేర్కొన్నారు. సోమవారం కొడిగెనహళ్లి గురుకుల ఎక్స్‌లెన్స్ పాఠశాలను సీఈవో చంద్రమౌళి, పూర్వవిద్యార్థి సాల్మన్ సందర్శించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలలో అటల్ ఇంకుబేషన్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు వారు తెలిపారు. ప్రిన్సిపల్ ఎన్.వి.మురళీధర్‌బాబు మాట్లాడుతూ దీని ఏర్పాటుతో విద్యార్థుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక నైపుణ్యాన్ని మెరుగుపరిచి వారి ద్వారా నూతన ఆవిష్కరణలు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

డీలర్ల ఎన్నిక వాయిదా

రాంనగర్(అనంతపురం) న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల ఎన్నిక ఈనెల 23న జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేయడం జరిగిందని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

చీటీల పేరుతో రూ.కోటి టోకరా

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిపట్టణంలో చీటీల పేరుతో రూ.2 కోట్లు మోసం చేసిన బాలకృష్ణపై సోమవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలకృష్ణ అనేక మందితో చీటీలు వేస్తూ నమ్మకంగా ఉండేవాడు. ఈక్రమంలో ప్రజల నుంచి రూ.కోటి దాకా వసూలు చేసి మోసం చేశాడు. పది రోజుల నుంచి కనిపించకపోవడంతో పట్టణంలోని పలువార్డులకు చెందిన బాధితులు పోలీసులకు ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య



మధు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : కనుంపల్లి గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన మధు(28) అనే యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన మధు రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులకు చరవాణి ద్వారా వస్తున్నానని సమాచారమిచ్చాడు. సోమవారం యువకుడి మృతదేహం ఉన్న విషయం పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై గౌస్‌బాషా పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పురుగుమందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడని ధ్రువీకరించారు. మృతుడికి పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరుకు చెందిన అనితతో వివాహం జరిగింది. వీరికి సంతానం కలగకపోవడంతో అనంతపురంలోని ఓ వైద్యుడి దగ్గర చికిత్స చేయించుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలుస్తాయని సీఐ కౌలుట్లయ్య, ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..




మనోజ్

మడకశిర: మండల పరిధిలోని హెచ్.ఆర్.పాళ్యం గ్రామంలోని నాగరాజు కుమారుడు మనోజ్‌కుమార్(21) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఇంటికి వెళ్లి తలుపులు తీసి చూడగా వేలాడుతూ కనిపించిన కుమారుడిని చూసి కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని వెంటనే యువకుడిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బంధువుల కథనం ప్రకారం.. మృతుడు ఐటీఐ పూర్తి చేసుకుని సరైన ఉద్యోగం దొరక్క, ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలియజేశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వివాహిత..

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని గుప్తాకాలనీలో నివాసముంటున్న అపర్ణ(32) అనే వివాహిత సోమవారం బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల వివరాల ప్రకారం అపర్ణ దంపతులు కొంతకాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. ఈక్రమంలో అపర్ణ తీవ్ర ఒత్తిడికి లోనైన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు భర్త..



చిరంజీవి

తాడిమర్రి : మండలంలోని నార్శింపల్లికి చెందిన డేరంగుల చిరంజీవి (42) ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని మృతి చెందినట్లు సోమవారం ఎస్సై నాగసాయి తెలిపారు. వడ్డేర పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అతను మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో తరచూ కుటుంబ సభ్యులతో గొడవకు దిగుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు నాలుగు రోజుల కిందట అతనికి మద్యం మాన్పించేందుకు బళ్లారికి వెళ్లి విరుగుడు మందు తాపించారు. అయినా మద్యం తాగడంతో భార్య మందలించి పిల్లల్ని తీసుకుని బయటకు వచ్చేసింది. దీనికి మనస్తాపం చెందిన చిరంజీవి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లోకి వెళ్లిన కుమార్తె ఫ్యానుకు వేలాడుతున్న తండ్రిని చూసి తల్లి, బంధువులకు సమాచారం తెలిపింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : గోరంట్ల, సోమందేపల్లిలో నాసన్, బెల్ కంపెనీల ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ఆర్‌అండ్‌ఆర్ ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండు చేశారు. సోమవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్ వద్ద రైతుల సంఘం నాయకులు, భూనిర్వాసితులు ఆందోళన చేశారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం పంపిణీలో తేడాలు ఉన్నాయని, వెంటనే ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి, న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. జీవో నం: 350 అమల్లోకి తీసుకురావాలని డిమాండు చేశారు. భూములు ఇచ్చిన రైతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు జిల్లా రైతు సంఘం కార్యదర్శి పెద్దన్న వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు నష్టపోయిన వేరుసెనగ, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ రెడ్డి డిమాండు చేశారు. వేరుసెనగ, మొక్కజొన్న తడిచి మొలకలు వచ్చాయని, కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని వాపోయారు. 45 కేజీ వేరుసెనగకాయల బస్తా రూ.2,500, మొక్కజొన్నలు క్వింటా రూ.2000కు దళారులకు రైతులు విక్రయించుకోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన కోరారు. అనంతరం జేసీ అభిషేక్‌కుమార్‌కు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.

కన్నోళ్ల కలలు చెదిరిపోయాయ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

ఆ ఇద్దరూ వేర్వేరు గ్రామాలకు చెందిన యువకులు. ఆ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచారు. అంతకంతకూ ఎదుగుతున్న కుమారులను చూసిన తల్లిదండ్రులు వారిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇక తమకేం భయం లేదని కన్నబిడ్డల్ని చూస్తూ జీవితాలను సాఫీగా సాగిస్తున్నారు. అంతలో విధి చిన్నచూపు చూసింది. రోడ్డు ప్రమాదంలో ఆ ఇద్దరు యువకుల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. కన్నోళ్ల ఆశల కోటలు కళ్లముందే కూలిపోయాయి. ఈ హృదయ విదారక ఘటన ఆ కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చింది.



శేషాద్రి గంగరాజు

రొద్దం, న్యూస్‌టుడే : రొద్దం ఎస్సీ కాలనీకి చెందిన శేషాద్రి (23) తన చెల్లికి విజయవాడ రైలు తప్పిపోవడంతో ఆమెను తీసుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఇదే సమయంలో కోగిర గ్రామానికి చెందిన గంగరాజు (19) విధుల్లో భాగంగా కియా పరిశ్రమకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ఆ రెండు వాహనాలు ఆదివారం రాత్రి ఎల్జీబీనగర్ వద్ద ఎదురుపడి వేగంగా ఢీకొన్నాయి. ఈఘటనలో శేషాద్రి(23) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. గంగరాజు(19) తీవ్రంగా గాయపడటంతో బంధువులు పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృత్యువాతపడ్డాడు. గంగరాజు తన తల్లిదండ్రులకు నలుగురు కుమార్తెలు కాగా ఇతనొక్కడే కుమారుడు. శేషాద్రి కన్నోళ్లకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. చేతికొచ్చిన పిల్లలు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. గంగరాజు తండ్రి గంగప్ప అనారోగ్యంతో అనంతపురం ఆసుపత్రిలో 20 రోజులుగా చికిత్సపొందుతున్నారు. కుమారుడి మరణం అతన్ని మరింత కుంగదీసింది. ఈ ఘటనపై రొద్దం ఎస్సై నరేంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష



ముద్దాయిని జైలుకు తరలిస్తున్న పోలీసు

అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే: రాంగ్ కాల్‌తో పరిచయం.. వివాహేతర సంబంధంగా మారింది. పరిచయమైన 31 రోజులకే హత్యకు దారి తీసింది. ఈ ఘటన కుడేరు మండలం ఉదిరిపికొండ ప్రాంతంలో చోటు చేసుకుంది. కేసు విచారణ చేపట్టిన జిల్లా కోర్టు నిందితుడు రుద్రేష్‌కు యావజ్జీవ శిక్షను విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది. కేసు పూర్వపరాలు ఇలా.. కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన రుద్రేష్ ఎంఏ పూర్తి చేశాడు. భార్య పార్వతి బీఈడీ పూర్తి చేసింది. ఇద్దరూ కళ్యాణదుర్గంలో ట్యూషన్స్ చెప్పుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకరోజు రుద్రేష్ ఫోన్‌కు రాంగ్ కాల్ వచ్చింది. ఆ ఫోన్ చేసింది విజయలక్ష్మి. ఈమెకు వివాహమైంది. టీటీసీ చదువుతోంది. ఇలా రాంగ్ కాల్‌తో పరిచయమై వాట్సప్ సందేశాలు, అశ్లీల ఫొటోలు పంపుకొన్నారు. ఈ వ్యవహారం కాస్త వివాహేతర సంబంధం దాకా వెళ్లింది. 'నేను భర్తను వదిలేసి వస్తాను. నీవు నీ భార్యను వదిలేసిరా' ఇద్దరూ పెళ్లి చేసుకుందామని ఒత్తిడి పెంచింది. లేదంటే అశ్లీల ఫొటోలు, మెసేజ్‌లు పోలీసులకు ఇచ్చి కేసు పెడతానని బెదిరింపులకు దిగింది. దీంతో రుద్రేష్ మానసిక సంఘర్షణకు గురయ్యాడు. 2018 నవంబరు 5న అనంతపురం వచ్చారు. ఇద్దరూ కలసి ద్విచక్ర వాహనంపై కూడేరు మండలం ఉదిరిపికొండ శివారులోని కొండల్లోకి చేరుకున్నారు. ముందుగానే అనుకున్నట్లు రుద్రేష్ విజయలక్ష్మి గొంతుకు చున్నీతో బిగించి ఊపిరి ఆడకుండా చేసి బండరాయిని తలపై వేసి కిరాతకంగా చంపాడు.

ఆభరణాలు అపహరించి...

హత్య అనంతరం రుద్రేష్ ఆమె ఒంటిపై ఉన్న నగలను అపహరించి కళ్యాణదుర్గంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టాడు. వచ్చిన డబ్బుతో భార్యకు నల్లపూసల దండకు బంగారు నగల దుకాణంలో ఆర్డరు ఇచ్చాడు. ఎల్ఈడీ టీవీ కొనుగోలు చేశాడు. మరోపక్క విజయలక్ష్మి కనిపించకపోవడంతో ఆమె భర్త అనంతపురం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. రెండు రోజుల తర్వాత ఉదిరిపికొండ ప్రాంతంలో విజయలక్ష్మి మృతదేహం బయట పడింది. దీంతో కూడేరు పోలీసులు నిందితుడు రుద్రేష్‌పై హత్య కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ప్రసాద్‌రావు కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ హరినాథరెడ్డి వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో యావజ్జీవ శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు.

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

స్కౌట్ శిక్షణతో సేవాభావం

లేపాక్షి, న్యూస్‌టుడే: స్కౌట్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందడం వలన విద్యార్థి దశనుంచే క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి పేర్కొన్నారు. మండలంలోని పులమతి ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ టెస్టింగ్ శిబిరాన్ని సోమవారం డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి స్కౌట్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందిన వారికి ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. సేవా భావం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం వంటి లక్షణాలు అలవడుతాయన్నారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు, స్కౌట్ మాస్టర్లకు లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ రూ.1.50లక్షలకు పైగా వెచ్చించి భోజన వసతి కల్పించారు. సర్పంచి అశ్వర్థనారాయణ, ఎంఈవోలు పాల్గొన్నారు.

పుట్టగొడుగులు తిని అరుగురికి అస్వస్థత

అమరాపురం(పరిగి), న్యూస్‌టుడే: మండలంలోని ఆదేపల్లి గ్రామంలో పుట్టగొడుగులు తిని ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నేసే వెంకటశివప్ప, శాంతమ్మ, శ్రీనివాసులు, అలివేలమ్మలు కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామసమీపంలోని ఒక పొలంలో మొలిచిన పుట్టగొడుగులను సోమవారం తెచ్చుకొని వండుకొని తిన్నారు. తిన్న వెంటనే తీవ్ర అస్వస్థత గురికావడంతో 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారికి ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

అన్నను కత్తితో పొడిచిన తమ్ముడి అరెస్టు

మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర పట్టణంలోని మహీన్ మటన్ షాపు వద్ద ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో అన్నను కత్తితో పొడిచిన తమ్ముడిని అరెస్టు చేసినట్లు సీఐ రామారావు తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన అన్న షేక్ ఇబ్రహీం, తమ్ముడు ఇమామ్‌హుల్లా తండ్రి సంపాదించిన ఆస్తి విషయంలో గొడవ పడ్డారు. తమ్ముడు మటన్ దుకాణంలోని కత్తిని తీసి అన్నను పొడిచి పరారయ్యాడు. దాడిలో గాయపడిన షేక్ ఇబ్రహీంను వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించగా సోమవారం ఉదయం ఇమామ్‌హుల్లాను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ఇంటి పైకప్పు కూలి ముగ్గురికి గాయాలు

రొద్దం: కల్లుకుంట గ్రామంలో సోమవారం ఉదయం పాతబడిన ఇంటి పైకప్పు కూలిన ఘటనలో తల్లి, కూతురు, కుమారుడు గాయపడ్డారు. స్థానికుల, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. బేల్దారు పనుల కోసం సోమవారం ఉదయం 6 గంటలకే కుటుంబ యజమాని బాలాజీ హిందూపురానికి వెళ్లాడు. నిద్ర లేచిన నాగలక్ష్మమ్మ, చిన్నారి నీరజ, కుమారుడు గోవర్ధన్‌లు ఇంట్లో కూర్చున్నారు. ఉన్నఫలంగా పైకప్పు కూలి వారి మీద పడడంతో మట్టిలోనే ఇరుక్కుపోయారు. వెంటనే స్థానికులు గుర్తించి వారిని బటయకు తీశారు. ఈ ప్రమాదంలో చిన్నారి నీరజకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ముగ్గురిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

లేపాక్షి: లేపాక్షిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చిలమత్తూరు మండలం తమ్మినాయనిపల్లికి చెందిన శ్రీకాంత్ హిందూపురం గ్రామీణ మండలం బీరేపల్లి వద్దనున్న కియో ఫ్యాక్టరీలో పని ముగించుకొని ఇంటికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలో లేపాక్షి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై ఆగిఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వచ్చిన జనసేన నియోజకవర్గ నాయకుడు ఆకుల ఉమేష్ గమనించి క్షతగాత్రుడిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల : బి.గొల్లపల్లికి చెందిన అశోక్ కుటుంబ సమస్యల నేపథ్యంలో సోమవారం అందుబాటులో ఉన్న మాత్రలుమింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్సలు చేసి 108 వాహనంలో హిందూపురం పంపించారు.

రెండు దుకాణాల్లో చోరీ

గోరంట్ల : గోరంట్ల - హిందూపురం ప్రధాన రహదారికి ఆనుకొని చిత్రావతి నది సమీపంలో ఉన్న రెండు దుకాణాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇందులో షాన్వాజ్ ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.అయిదు లక్షలకు పైగా విలువచేసే కొత్తమోటార్లు, వైర్‌బండిళ్లు, ఫ్యాన్లు ఎత్తుకెళ్లినట్లు యజమాని దాదాపీర్ తెలిపారు. దుకాణంలోని సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ దుకాణానికి సమీపంలోనే ఉన్న ఖలీం టీ కొట్టులో సుమారు రూ.28వేలు విలువ చేసే సామగ్రి ఎత్తుకెళ్లారు.

పోలీసుల తనిఖీలు

సోమందేపల్లి : సోమందేపల్లిలోని పలు కాలనీల్లో అనుమానితుల గృహాలను సీఐ రాఘవన్ ఆధ్వర్యంలో ఎస్సైలు రమేశ్ బాబు, రాజేశ్, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. నాలుగు ఇళ్లను క్షుణ్నంగా పరిశీలించారు. మరో రెండిళ్ల తాళాలు వేయడంతో నిఘా ఉంచామని సీఐ తెలిపారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన అవసరం

మడకశిర, న్యూస్‌టుడే : పట్టణంలోని మారుతీనగర్‌లోని ఎస్సీ వసతి గృహాన్ని సోమవారం స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అశోక్‌కుమార్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వార్డెన్‌తో వసతులు, సౌకర్యాల పై ఆరా తీశారు. విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఇందుకు అవసరమైన జడ్జి తెలిపారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న జడ్జి ఆర్.అశోక్‌కుమార్

గ్రామీణ రహదారులు అధ్వానం.. అవస్థల్లో జనం



గుంతల రోడ్డులో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకుడు

కొడిగెనహళ్లి (పరిగి), సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు ఆలనాపాలనా లేక అధ్వాన స్థితికి చేరుకున్నాయి. బీచిగానపల్లికి వెళ్లే రహదారిలో ఊటకూరు చెరువు కట్ట కింద గుంతలు ఏర్పడి ద్విచక్రవాహనాలు వెళ్లలేని స్థితికి చేరుకుంది. బీచిగానపల్లి నుంచి గొల్లపల్లికి వెళ్లే రహదారి కంకర తేలింది. పరిగి షుగర్ ఫ్యాక్టరీ నుంచి శ్రీరంగరాజుపల్లి గ్రామానికి వెళ్లే రహదారి బాగు చేసేందుకు గత వైకాపా ప్రభుత్వంలో ఆ శాఖ మంత్రిగా పనిచేసిన శంకరనారాయణ అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడమే కాని ఒక్క పైసా విదుదల చేయలేదు. ఈ రహదారిపై ప్రతినిత్యం వస్త రవాణా వెళ్లే పరిశ్రమలకు వెళ్లేందుకు మహిళా కార్మికులు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. గుంతలమయంగా మారిన రహదారిపై వాహన చోదకులకు ప్రయాణం నరక ప్రాయంగా మారింది. ఆటో చోదకులు అదుపుతప్పితే ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. కిలోమీటరు పరిధిలో రహదారిపై 30 గుంతలు ఉన్నాయి. పరిగిలో పైడేటి సర్కిల్ నుంచి చిన్నపల్లికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి మొత్తం దెబ్బతింది. కొద్దిపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు నిలిచి వాహన చోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వమైనా ఆయా గ్రామాలకు వెళ్లే గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

సోమందేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చాకర్లపల్లిలో హిందూపురం ప్రధాన ర.భ రహదారి గుంతలమయంగా మారింది. పాతూరు, రైల్వేస్టేషన్, రైల్వే గేటు ఎదురుగా ఇలా పలుచోట్ల రహదారిపై గుంతలు పడి..నీరు నిలుస్తోంది. ఈ విషయం తెలియక, ఆదమరిచి వాహనాలను నడుపుతూ కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. తరచూ రాత్రిళ్లు ఆయాచోట్ల రహదారి దెబ్బతిన్న విషయం తెలియని వాహనాల చోదకులు వేగంగా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. నెలలు కావస్తున్నా ఇక్కడి రహదారి దుస్థితి గురించి ఏఒక్క అధికారి, ప్రజాప్రతినిధి పట్టించుకొన్న పాపానపోలేదని గ్రామస్థులు, పలువురు చోదకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇన్‌ఛార్జి డీఈ వెంకటేశులు మాట్లాడుతూ వెంటనే పరిశీలించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

పునరుద్ధరణకు చర్యలు

పరిగి మండలంలో దుస్థితిలో ఉన్న పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారుల పునరుద్ధరణకు అవసరమైన నిధులను మంజూరు చేయించి దశల వారీగా బాగు చేయిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రహదారులతో పాటు శ్రీరంగరాజుపల్లిలో జయమంగళి నదిపై వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

-బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత



చాకర్లపల్లిలో పాతూరు వద్ద గుంతల మయం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: హిరేతుర్పి ఐదిమ్మ కాలనీలో దీపాలు వెలగడం లేదు. -ఈశ్వర్
సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. -నాగరాజునాయక్, ఈఓఆర్డీ.
సమస్య: గొల్లపల్లిలో తాగునీటి సమస్య ఉంది. -తిప్పయ్య
సమాధానం: బోరుకు మరమ్మతులు చేస్తాం. -రంగస్వామి, సర్పంచి, తాళకెర -న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: రొళ్లలోని ఎస్సీ కాలనీలో కాలువలు శుభ్రం చేయలేదు. దోమలు పెరిగి రోగాలు వస్తున్నాయి. -హనుమంతరాయ
సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం. -బాబూరావ్, కార్యదర్శి, రొళ్ల.
సమస్య: ఐదిదమ్మ కాలనీకి వెళ్లే మట్టి రోడ్డులో గుంతలు పడి వర్షపు నీటితో బురదమయంగా మారాయి. సీసీ రోడ్డు నిర్మించాలి. -శేఖరప్ప
సమాధానం: ప్రతిపాదనలు పంపాం. వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తాం. -ప్రసాద్, ఎంపీడీవో, రొళ్ల -న్యూస్‌టుడే, రొళ్ల

అనధికార లేఅవుట్లపై కొరడా

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని సర్వే నంబరు 697, 698 లోని 8ఎకరాల విస్తీర్ణంలో అనధికారికంగా వేస్తున్న లేఅవుట్లో కమిషనర్ శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు. సోమవారం అనధికార లేఅవుట్లలోని సరిహద్దు రాళ్లను నగర పంచాయతీ సిబ్బంది తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో అనధికారికంగా వేసిన, వేస్తున్న లేఅవుట్ల ప్రజలు ప్లాట్లుకొని మోసపోవద్దని సూచించారు.



రాళ్లను తొలగిస్తున్న నగరపంచాయతీ సిబ్బంది

ప్రతిభకు పట్టం





హిందూపురంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 9వ తరగతి చదువుతున్న యు.గౌతమి ప్రథమ, పదో తరగతికి చెందిన కేటీ నిషకళ ద్వితీయ, 9వ తరగతికి చెందిన ఆర్.వెన్నెల తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుమలత బహుమతులు అందజేశారు. -న్యూస్‌టుడే, హిందూపురం

పూలపల్లి గ్రామస్థులు తెదేపాలో చేరిక

అగళి, న్యూస్‌టుడే: పూలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సోమవారం ఎమ్మెల్సీ ఎంఎస్ రాజు నేతృత్వంలో తెదేపాలో చేరారు. కోడిపల్లి సర్పంచి నరసింహమూర్తి ఆధ్వర్యంలో తరలివెళ్లిన నాయకులు యోగేష్ యాదవ్, ఈరన్న, రేవన్న, తిమ్మారెడ్డి రాజు తదితరులకు ఎమ్మెల్యే కండువా, మల తిప్పేస్వామి తెదేపా కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

చెరువు కట్ట గండి పూడ్చివేత

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఈదులబలాపురం చెరువుకు గండి పడటంతో అధికారులు, తెదేపా నాయకులు సోమవారం ఇసుక బస్తాలతో పూడ్చి వేశారు. నాలుగు రోజుల కిందట గండి పడటంతో తెదేపా నాయకులు కిష్టప్ప, నరసింహమూర్తి, రైతులు జలవనరుల శాఖ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ రమేశ్‌ల దృష్టికి తీసుకెళ్లారు. అయితే కట్టపై ఏపుగా ముళ్లకంపపెరిగిపోవడంతో కంపను తొలగించి గండి పూడ్చలేకుండా పోవడం, మరోవైపు వర్షాలు పడుతుండటంతో ఇసుక బస్తాలను చేర్చడం ఇబ్బందిగా మారింది. సోమవారం పొక్లెయిన్‌తో 500 ఇసుక బస్తాలను తరలించి గండిని పూర్తిగా మూసి వేశారు.



ఇసుక బస్తాల వద్ద ఏఈ రమేశ్, తెదేపా నాయకులు, రైతులు

విద్యార్థులు సాంకేతికత అందిపుచ్చుకొంటే భవిష్యత్తు

బైరేకుంట(చిలమత్తూరు), న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటే భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర పేర్కొన్నారు. మండలంలోని బైరేకుంట డీవీ అండ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.3 లక్షల విలువ చేసే కంప్యూటర్లు, జిరాక్స్ యంత్రం, ప్రింటర్ అందజేశారు. మండల కేంద్రంలోని పొట్టిశ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.2.50లక్షలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, స్టాండ్ బాక్స్‌ను హెరిటేజ్ సంస్థ సౌజన్యంతో అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ భీముడునాయక్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి కళాశాలకు వస్తున్నారని బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. టేకులోడు క్రాస్‌లోని గురుకుల పాఠశాల, బైరేకుంటలోని డివిఅండ్‌ఆర్ కళాశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తే మంత్రి నారాలోకేష్, ఆయన సతీమణి నారాబ్రాహ్మణి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో విద్యార్థులకు ఫొటోలు తీయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టేకులోడుక్రాస్‌లోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఫ్యాన్లును అందజేశారు. 544 జాతీయ రహదారి పనుల సమయంలో పాఠశాల ప్రహరీ కూలిపోయిందన్నారు. నారాబ్రాహ్మణి సొంత నిధులు రూ.50లక్షలతో గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే సతీమణి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అనూష, మండల తెదేపా కన్వీనర్ రంగారెడ్డి, బేకరి గంగాధర్, బాలాజీ, నందీశప్ప, అశ్వర్థప్ప, నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, గౌరీశంకర్, బ్రహ్మానందరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు చిన్నప్రవీణ్, ఎల్ఐసీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వసుంధర

బాధితులకు పరామర్శ

హిందూపురం: ఇటీవల సామూహిక అత్యాచారానికి గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అత్తా, కొడలును సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాధితులు ఇంకా సంఘటన నుంచి తేరుకోలేక పోతున్నారన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తప్పక కుటుంబాన్ని ఆదుకొంటామన్నారు. నింధితులకు త్వరగా శిక్ష పడేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక కోర్టు అందుబాటులోకి తీసుకొస్తున్నారని తెలిపారు.



మడకశిరలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న సీఐలు, ఎస్సైలు, సిబ్బంది



అమరవీరుల దినోత్సవం సందర్భంగా వర్ష సైనిక్ స్కూల్ విద్యార్థులు

పోలీసు అమరవీరులకు నివాళి

మడకశిర, న్యూస్‌టుడే : పట్టణంలోని పోలీసు అమరవీరుల స్మారక పార్కులో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. సీఐలు రామారావు, రాజ్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుడిబండ : గుడిబండలో వర్ష సైనిక్ స్కూల్ విద్యార్థులచే ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఓపన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి ఎస్సై మునిప్రతాప్ పోలీస్ వ్యవస్థ, రికార్డులు, తదితర అంశాలపై వివరించారు. సిబ్బంది రఫీ, వెంకటేశ్, పాతన్న, మల్లికార్జున, రామప్ప, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, పోలీసులు ప్రదర్శన నిర్వహించారు. బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడి నివాళులు అర్పించారు. ఏఎస్సై రామాంజినేయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులకు పట్టణానికి చెందిన పోలీసులు సోమవారం నివాళి అర్పించారు. స్థానిక రహమత్‌పూర్‌లోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళి అర్పించారు. పట్టణ ఒకటో పోలీస్ స్టేషన్ సీఐ రాజగోపాలనాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హిందూపురంలో నివాళి అర్పిస్తున్న పోలీసులు

'మంత్రిపై అసత్య ప్రచారం చేస్తే సహించం'

పెనుకొండ: సామాజిక మాధ్యమాల్లో మంత్రి సవితపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని ఎన్డీఏ కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో నియోజకవర్గం కూటమి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో పెనుకొండ మంత్రి ఒక డిక్టేటర్ అంటూ కథనం ప్రచురించి అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సామజిక మాధ్యమాల్లో అసత్య ఆరోపణలు చేస్తూ కూటమి ప్రభుత్వంలోనే వర్గపోరు నడుస్తోందన్న అపోహ కల్గిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నాయకుల మధ్య ఎలాంటి అంతరాలు లేవన్నారు. ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి సవిత ఇద్దరు సమన్వయంతో పార్టీ శ్రేణులకు అండగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తెదేపా, భాజపా, జనసేన పార్టీ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అసత్య వార్తల పై పోలీసులకు ఫిర్యాదుఅనంతరం తెదేపా శ్రేణులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు.



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న తెదేపా శ్రేణులు

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, అధికారులు


మడకశిర, న్యూస్‌టుడే : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులతో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం వైఫల్యం కారణంగానే ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తున్నాయని తెలిపారు. పింఛను, ఇళ్లు, తాగు, సాగునీరు తదితర సమస్యలకు సంబంధించి వినతులు వస్తున్నాయని అన్నారు. 228 వినతులురాగా ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సాధికారత కన్వీనర్ పాండురంగప్ప, తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ సోనిబాయి, సీఐలు రామారావు, రాజ్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తి, తెదేపా మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి బయటికి పంపించేశారు



మడకశిర పట్టణంలో నా భర్త ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి లేవలేని స్థితిలో మంచం పట్టారు. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు ఉన్నారు. కనీసం నా భర్తకు రావాల్సిన ఆస్తిని కూడా ఇవ్వకుండా ఇబ్బదులు పెడుతున్నారు. ఇంటి నుంచి కూడా బయటికి పంపించేశారు. పిల్లల పోషణ కష్టంగా మారింది. నాకు న్యాయం చేయాలని కోరుతున్నాను. - **రాధ, మడకశిర పట్టణం**

వర్షానికి ఇల్లు కూలింది



ఇటీవల కురిసిన వర్షానికి ఇల్లు కూలింది. భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాను. ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇల్లు మంజూరు చేయాలని ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే స్పందించి అధికారులు పరిశీలించి ఇల్లు మంజూరు చేస్తారని తెలియజేశారు. - **శ్రీనివాస్‌నాయక్, గుర్రపుకొండ, మడకశిర మండలం**

మాకు రావాల్సిన భూమి ఇవ్వాలి



జిల్లెడగుంట గ్రామంలో అన్నదమ్ములకు సంబంధించి 507-1 సర్వే నంబరులో 13.95ఎకరాలు భూమి ఉంది. ఇందులో మా భాగానికి రావాల్సిన భూమిని ఇవ్వాలని కోరుతున్నాను. ఇప్పటికే చాలా సార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ప్రజాదర్బార్ ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని వచ్చాను. - **జిల్లెడగుంటప్ప, జిల్లెడగుంట, మడకశిర మండలం**

చుక్క నీరు రాక నాలుగు నెలలు

బసవనపల్లిలో ఏర్పాటు చేసిన శ్రీరామరెడ్డి తాగునీటి కుళాయి నుంచి నాలుగు నెలలుగా నీరు రావడం లేదని ఆగ్రామ మహిళలు వాపోతున్నారు. స్థానికంగా పంచాయతీ తాగునీటి పథకాల నుంచి వచ్చే నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి స్పందిస్తూ సమస్య పరిస్కరిస్తామన్నారు. -న్యూస్‌టుడే, అమరాపురం



పైపు లీకేజీతో కలుషితం



రంగేపల్లిలోని అంబేద్కర్ కాలనీ పక్కన సిమెంటు రహదారిపై తాగునీటి పైపులైన్ దెబ్బతినింది. దీంతో నీరు కలుషితం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై మాగేచెరువు సర్పంచి నరసింహులును వివరణ కోరగా త్వరలోనే పైపులైన్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. -న్యూస్‌టుడే, సోమందేపల్లి.

ఎప్పుడు కూలేనో?



పట్టణంలోని ఇఎస్ఐ కార్యాలయం ఎదురుగా ఎండిన చెట్టు దర్శనమిస్తోంది. ఏసమయంలోనైనా కొమ్మలు రాలే పరిస్థితి ఉంది. ఈ రహదారిలో పాదాచారులు, వాహనదారులు ఎక్కువగా సంచరిస్తుంటారు. ప్రమాదం జరగకముందే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, హిందూపురం పట్టణం

రోడ్డుపైనే వాహనాలు.. రాకపోకలకు ఇబ్బందులు

హిందూపురం,(బాలాజీనగర్), న్యూస్‌టుడే: పట్టణంలో బాలాజీనగర్, ధన్‌రోడ్, మారుతీనగర్, మేళాపురం ప్రాంతాలకు వెళ్లే ఆర్పీజీటీ రోడ్డులో నిత్యం వాహనాలు అడ్డదిడ్డంగా ఉంచుతుండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పట్టణంలో ఎక్కడలేని విధంగా రహదారికి అటూఇటూ ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు ఉన్నాయి. వీటికి అధిక సంఖ్యలో వ్యాధి బాధితులు వాహనాల్లో వస్తుంటారు. వీరివలన కొంత ఇబ్బంది ఉన్నా ఇతర వాహనాలు రహదారులపై ఉంచుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఎటూ వెళ్లలేకపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అయితే చాలా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ కనీసం పట్టించుకోవటం లేదని ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో అక్రమ కట్టడాలు ఉండటం కూడా ట్రాఫిక్ ఇబ్బందికి కారణమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ సింగం శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు.



పట్టణంలోని ఆర్పీజీటీ రోడ్‌లో అడ్డదిడ్డంగా నిలిచిన వాహనాలు

పుట్టపర్తి

స.హ.చట్టం.. స్వేచ్ఛాయుత హక్కు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : సమాచార హక్కు చట్టం అనేది మన ప్రభుత్వాలు పౌరులకు కల్పించిన స్వేచ్ఛాయుత హక్కు అని దాన్ని దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా వారిదేనని ఏపీపీ కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గొట్లూరులో సమాచార హక్కు, ప్రజా చైతన్య వేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రజా చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ హబీబుర్ రహమాన్, ఏపీపీ కృష్ణయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సమాచార ప్రజా చైతన్య జిల్లా ఉపాధ్యక్షుడు లింగమయ్య, డివిజన్ కార్యదర్శి అయాజ్, మండల అధ్యక్షుడు పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో మెగా రక్తదాన శిబిరం

ధర్మవరం : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రజనీ హీలింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్, రక్తబంధం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పోలీసులు, పట్టణానికి చెందిన యువకులు 74 మంది రక్తదానం చేశారు. కర్నూలు బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు రక్తదాతల నుంచి రక్తం సేకరించారు. ధరలేమియా చిన్నారులకు సేకరించిన రక్తం అందిస్తామని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. రక్తదాతలకు డీఎస్పీ టి.శ్రీనివాసులు, 1వ పట్టణ, 2వ పట్టణ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డెప్ప ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రజనీ, రక్తబంధం ట్రస్ట్ ప్రతినిధులు కన్న వెంకటేష్, ఉదయ్‌కుమార్, జయప్రకాష్, చంద్రశేఖర్, కౌన్సిలర్ కేతా లోకేశ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారి సుబ్బరాయుడు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నేడు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత సమక్షంలో మంగళవారం నిర్వహించే రెవెన్యూ ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి సోమవారం కోరారు. ఆపరిష్కృతంగా భూసమస్యలు ఉన్నవారు ఆధారాలతో వినతులు అందించాలన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించే కార్యక్రమంలో ఆర్డీవో మహేష్‌కుమార్, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొంటారని వివరించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్.ఎస్. (కదిరి పట్టణం), న్యూస్‌టుడే : ఎల్ఐసీ ఏజెంట్ల కమీషన్ పెంచాలని, లక్ష రూపాయల పాలసీని పునరుద్ధరించాలని డిమాండు చేస్తూ సోమవారం కదిరి జీవిత బీమా కార్యాలయం ఎదుట ఏజెంట్లు ఆందోళన నిర్వహించారు. ఏజెంట్లపై యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఈ నెల 28 వరకు ఆందోళన కొనసాగిస్తామని జీవిత బీమా ఏజెంట్ల సంఘం నాయకులు నారాయణరెడ్డి, రమణారెడ్డి, హనుమంతరెడ్డి, శ్రీనివాసులు, మురళీ, సూరి తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీతో
సరిపెట్టేశారు!



కదిరి పట్టణం, న్యూస్‌టుడే : జగనన్న పాలనలో ఇళ్ల కాదు ఊళ్లు నిర్మిస్తున్నామంటూ ఊదరగొట్టిన వైకాపా నాయకులు గత సంవత్సరం డిసెంబరు 21న జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజున కదిరిలో 2000 మందికి ఇంటి పట్టాలు పంపిణీ అంటూ గొప్పలకు పోయారు. ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించి స్థలాలు చూపకనే ఉత్తుత్తి పట్టాలను పంపిణీ చేశారు. కుటాగుళ్ల రెవెన్యూ పొలంలోని సర్వే నం:41లో 5 ఎకరాలలో 200 మందికి పైగా ఇంటి పట్టాలు ఇస్తున్నామంటూ ప్రకటించారు. వాస్తవానికి ఈ భూమి యూడీఏ జాబితాలో ఉంది. ప్రభుత్వం మాదేనన్న భావంతో నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా సరిహద్దు రాళ్లు నాటించారు. మున్సిపల్ సిబ్బందిచేత సరిహద్దు రాళ్లు నాటించారు. లబ్ధిదారుల ఎంపికకు అనుసరించాల్సిన విధానాలను పట్టించుకోకుండా కొన్నిలక్ష్య సిఫార్సు మేరకు పేర్లను ఎంపిక చేసి పట్టాలను రాశారు. మున్సిపాలిటీ నిజీశుద్ధి ప్లాంటుకు కేటాయించిన భూమిలోనూ సరిహద్దు రాళ్లు నాటేశారు. వాటిని అప్పటి శాసనసభ్యుడు సిద్దారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. పట్టాలు ఇచ్చి ఏడాదవుతున్నా.. లబ్ధిదారులకు స్థలాలు చూపలేదు. స్థలం కేటాయించకుండా ఉత్తుత్తి పట్టాలతోనే సరిపెట్టేశారంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కదిరి రెవెన్యూ పొలంలోని సర్వే నం:21లో మూర్తిపల్లి సమీపంలో యూడబ్ల్యూ భూమిని చదునుచేసి వెయ్యి మందికి పట్టాలు ఇస్తున్నట్లు ప్రకటించారు. జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. వాటిని తీసుకున్న లబ్ధిదారులు పత్రాన్ని సంబరపడిపోయారు. సంవత్సరం కావస్తున్నా.. స్థలం చూపకపోవడంతో మోసపోయామంటూ వాపోతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దారు మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఇటీవలే తాను బాధ్యతలు తీసుకున్నందున పట్టాలు పంపిణీకి సంబంధించి రికార్డులను పరిశీలిస్తామన్నారు. వీటితో భూమి స్వభావం, లబ్ధిదారుల ఎంపిక విషయంలో అనుసరించిన విధానంపైనా సమీక్షిస్తామన్నారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.


నిరుడు జగన్ పుట్టినరోజు సందర్భంగా లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి పట్టాల పంపిణీ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య : జలీవల కురిసిన వర్షాలకు చెలిమిబావి వీధి, ఆంధ్రా బ్యాంకు దగ్గర, పోస్టాఫీసు వీధి, శివారు పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంది. దీంతో దోమల బెడద పెరగడంతో రోగాలబారిన పడుతున్నాం.

- సుబ్రహ్మణ్యం, ముదిగుబ్బ

సమాధానం : దోమల బెడదకు ఫాగింగ్ చేయిస్తాం. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం.

సమస్య : ముదిగుబ్బలో కుక్కలబెడద విపరీతంగా ఉంది. కాలనీల్లో ద్విచక్ర వాహనాల్లో వెళ్లే, వచ్చే సమయంలో వెంబడిస్తున్నాయి. చిన్నారులు ఆడుకునే సమయంలో దాడి చేస్తున్నాయి. కుక్కలను నియంత్రించాలి. - మహేశ్, ముదిగుబ్బ

సమాధానం : నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

సమస్య : కాలనీలు, శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి.

- రామకృష్ణ, ముదిగుబ్బ

సమాధానం : వీధి దీపాలు బాగు చేయించి వెలిగేలా చేస్తాం.

(పై సమస్యలకు ముదిగుబ్బ ఈఓఆర్డీ దివాకర్ సమాధానమిచ్చారు)

- న్యూస్‌టుడే, ముదిగుబ్బ

ఉద్యోగాలకు పలువురి ఎంపిక

కదిరి, న్యూస్‌టుడే : యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధ్యాపకుడు హైదరవలీ, నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన, సిడాప్ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహించారు. మేళాకు 53 మంది నిరుద్యోగులు హాజరుకాగా వివిధ కంపెనీల ప్రతినిధులు ముఖాముఖి నిర్వహించి 23 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ ప్రిన్సిపల్ శివప్రసాద్, నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ నాగార్జున, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

పుట్టపర్తి : తిరుపతిలో జరిగే వివాహ వేడుకలకు 2022 మార్చి 26న ధర్మవరం చెందిన పెళ్లి బృందం ప్రత్యేక బస్సులో బయలుదేరింది. ఆ బస్సు చిత్తూరు జిల్లా భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో పది మంది మృతి చెందగా, 41 మంది గాయపడ్డారు. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసింది. కలెక్టర్ చేతన్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకున్నారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఆలయ భూముల అన్యాక్రాంతంపై ఆర్డీఓకు ఫిర్యాదు

ధర్మవరం : ధర్మవరం మండలం నిమ్మలకుంట వద్ద ఆంజనేయస్వామి మాన్యం అన్యాక్రాంతమైందని సీపీ కొత్తకోట వాసులు సోమవారం ధర్మవరం ఆర్డీఓ మహేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఓ వ్యక్తి మాన్యం భూములను ఆక్రమించి కల్యాణ మండపం, గుడి నిర్మించి ఆద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నాడని వారు వివరించారు. భూములను మరికొందరు ఆక్రమించి వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. సీపీ కొత్తకోట ఆంజనేయస్వామి మాన్యం భూములను కాపాడాలని ఆర్డీఓను వారు కోరారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నంబులపూలకుంట (గాండ్లపెంట) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నంబులపూలకుంట మండలం టీఎస్‌పల్లి పాఠశాల 9వ తరగతి విద్యార్థిని శిరీషా ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుని సుహాసిని తెలిపారు. శనివారం అనంతపురంలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో విద్యార్థిని ప్రతిభ చూపి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రామగిరి : రామగిరి విద్యుత్తు ఉపకేంద్ర పరిధిలోని పోలేపల్లి, చెర్లోపల్లి, రామగిరి, కంచికుంట, కొనగుంటపల్లి, ముత్యాలకుంట, ఉల్లిమడుగుల, కొత్తపల్లి గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.





ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి..

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని లయోలా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిపారు. ప్రతిభ చూపిన 9వ తరగతి ఎస్. రేవంత్‌కుమార్ (ప్రథమ) 10వ తరగతి కె.సంజన (ద్వితీయ) 8వ తరగతి డి.స్వప్న (తృతీయ)లకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌నాయుడు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలతో ఆలోచనా శక్తి

కదిరి : కదిరిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొమ్మిదో తరగతి జి.మహేష్ ప్రథమ, పదో తరగతి కె.సాయిగణేశ్ ద్వితీయ, ఎనిమిదో తరగతి కె.తేజ్ తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.రవినాయక్, ఎస్.గయాజ్, కె.సుధాకర్, నాగజ్యోతి, హరిత పాల్గొన్నారు.





ధ్రువపత్రాల పరిశీలన

బుక్కపట్నం, న్యూస్‌టుడే : కేజీబీవీలో బోధన, బోధనేతర పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను సోమవారం బుక్కపట్నం సమగ్ర శిక్షా కార్యాలయంలో పరిశీలన చేపట్టారు. 1:5 పరిధిలో అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశారు. ధ్రువపత్రాలను ఎంఈఓలు జయచంద్ర, సంపూర్ణానందబాబులు పరిశీలించారు. ఈ ప్రక్రియను డీఈఓ మీనాక్షి పరిశీలించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా పరిశీలన చేయాలని ఆమె చేయాలని సూచించారు.

మొబైల్ ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

ముదిగుబ్బ : ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే మొబైల్ ఆధార్ వాహనసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయకుమార్ సోమవారం తెలిపారు. 22వ తేదీ ఆదివిజ్ఞపల్లితండా, ఉప్పలపాడు, 23న దొరిగల్లు, సంకేపల్లి, 24న రామన్నమితండా, గౌండ్లారిపల్లి, 25న గుడ్డంపల్లితండా, జొన్నలకొత్తపల్లి సచివాలయాల్లో మొబైల్ ఆధార్ నిర్వహిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యంపై కేసు

ధర్మవరం : ధర్మవరానికి చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై సోమవారం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో శ్రీని వాసులు చదువుతున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన అతను ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో విద్యార్థి తండ్రి నాగభూషణ 2వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహన చోదకుడికి గాయాలు

ముదిగుబ్బ : ముదిగుబ్బ నుంచి కొత్తచెరువుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును సోమవారం స్థానిక పాతూరులో ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో బుక్కపట్నం మండలం యాదాలంకపల్లికి చెందిన చంద్రాయుడుకి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి పంపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదం.. మహిళపై దాడి

కదిరి పట్టణం : రెండు కుటుంబాల మధ్య స్థల వివాదంలో చోటు చేసుకున్న ఘర్షణలో మహిళకు గాయాలయ్యాయి. తనకల్లు మండలం లింగాలతండాకు చెందిన కోబి, బాలాజీ నాయక్ కుటుంబాల మధ్య ప్రహరీ నిర్మాణ విషయంలో వివాదం చోటుచేసుకుంది. సోమవారం ఇదే విషయమై గొడవ జరిగింది. ప్రహరీ నిర్మించవద్దంటూ ఒంటరిగా ఉన్న కోబిపై బాలాజీనాయక్, తావురేనాయక్, లోకేశ్‌నాయక్, కమలమ్మ, విజయమ్మ దాడిచేసి గాయపరిచారు. బాధితురాలు సమస్యను తనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేసి, కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

జూదరుల అరెస్టు

చెన్నేకొత్తపల్లి : మండలంలోని న్యామద్దల సమీపంలో జూదం ఆడుతున్న 12 మందిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు స్థావరంపై దాడులు చేశామన్నారు. ఇందులో 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.11,230 నగదుతో పాటు 10 చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరందరినీ న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఎస్ఐ వివరించారు.

చెరువులకు హంద్రీనీవా జలాలు అందించేందుకు కృషి

బుక్కపట్నం, న్యూస్‌టుడే : మండలంలోని మారాల రిజర్వాయర్‌కు హంద్రీనీవా నీటిని మళ్లించేందుకు సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గంగపూజ చేశారు. నీటిని రిజర్వాయర్‌కు మళ్లించి మాట్లాడారు. పుట్టపర్తి నియోజకవర్గానికి హంద్రీనీవా జలాలు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేశారన్నారు. ఏ నియోజకవర్గంలోని 192 చెరువులకు హంద్రీనీవా జలాలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్, సుబ్బారెడ్డి, జయరాం, నాగరాజు, తిప్పయ్య, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పక్కన మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి

ఎద్దులబండ్ల పరుగు పోటీలతో రైతుల్లో ఉత్సాహం

కొత్తచెరువు : గ్రామీణ ప్రాంతాల్లో ఎద్దుల బండ్ల పరుగు పోటీలు రైతుల్లో ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువులో వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి సంఘం నాయకుడు టింబర్ డిపో భాస్కర్ మిత్రబృందం ఆధ్వర్యంలో ఎద్దుల బండ్ల పరుగు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 60 ఎద్దుల బండ్లు పాల్గొన్నాయి. సోమవారం బహుమతుల ప్రదానం చేయడానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. పరుగు పోటీల్లో మొదటి, రెండు, మూడు, నాల్గో స్థానాల్లో నిలిచిన రైతు ధర్మాకు రూ.40 వేలు, వెంకటేశ్‌కు రూ.30 వేలు, శ్రీధర్‌నాయుడుకు రూ.20 వేలు, చంపతి నాయుడుకు రూ.10 వేలు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను వారు అందించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు అజరామరం

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ప్రజాప్రతినిధులు, పోలీస్‌స్టేషన్ల పరిధిలో డీఎస్పీ, సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లు ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల సేవలను గుర్తు చేసుకున్నారు. అమరవీరుల స్థూపాలకు పుష్పగుచ్ఛాలు సమర్పించి అంజలి ఘటించారు. శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా, ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసుల వారి ప్రాణాలను పణంగా పెడుతున్నారని వక్తలు పేర్కొన్నారు.

-న్యూస్‌టుడే బృందం


ధర్మవరంలో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద వందనం చేస్తున్న పోలీసులు


గాండ్లపెంట : పోలీస్ అమరవీరుల సంస్మరణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


ముదిగుబ్బలోని పీఏఎస్ పాఠశాలలో ..


రామగిరి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీత, తదితరులు

బకాయిలు చెల్లించాలని వినతి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సోమవారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి డీఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, నంబులపూలకుంట మండలాల కార్మికులకు వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలన్నారు. అప్పటి గుత్తేదారు తమ వేతనాలు, బిల్లులు డ్రా చేసుకున్నారే కానీ తమకు చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వివరించారు. స్పందించి తమకు రావాల్సిన వేతనాలు ఇప్పించాలని డీఈను వారు కోరారు. కార్యక్రమంలో కార్మికులు బాబయ్య, హరిబాబు, శ్రీనివాసులు, వెంకటరమణ, కార్తిక్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్.డబ్ల్యూఎస్. డీఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కలెక్టర్ దృష్టికి రహదారి సమస్య

కొత్తచెరువు, న్యూస్‌టుడే : కొత్తచెరువు రెవెన్యూ పరిధిలోని పొలాల మీద వ్యవసాయ పొలాలకు రహదారి లేక రైతులు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు నీలకంఠారెడ్డి తెలిపారు. రైతుల వినతి మేరకు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ పొలాలకు ఉన్న హక్కు మార్గాన్ని రైల్వే లైను నిర్మాణ సమయంలో మూసివేయడంతో సమస్య తలెత్తినట్లు రైతులు పేర్కొంటున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల ఆందోళన

ధర్మవరం పట్టణం : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్, కంటింజెంట్ (స్వచ్ఛ భారత్) కార్మికుల వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన స్వచ్ఛ భారత్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సీఐటీయూ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో రూ.6 వేలు వేతనంతో కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస సమాన వేతనం కార్మికులకు అందించాలని ఈ ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఉన్నత న్యాయ స్థానం ఆదేశాలను పాటించేలా చూడాలని నాయకులు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జేవీ రమణ, లక్ష్మీదేవి, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు లక్ష్యంతో చదవాలి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : బాలికలు లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆర్‌డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, రీజనల్ డైరెక్టర్ ప్రమీల పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎనుములవారిపల్లిలో 'అంతర్జాతీయ బాలికా దినోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రమణప్ప, ఆర్‌డీటీ ఏటీఎల్ కృష్ణ, ప్రధానోపాధ్యాయిని ఎస్తేర్‌రాణి, ఆర్‌డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనం.. నిరుపయోగం



కదిరి మండలం యర్రదొడ్డి పంచాయతీ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లిలో ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారి.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీన్ని మొదట్లో కమ్యూనిటీ భవనంగా.. ఆ తరువాత దాన్ని అంగన్‌వాడీ కేంద్రంగా వినియోగించారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉండటంతో భవనం లోపల ప్రాంతం మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయింది. దానికి చిన్నపాటి మరమ్మతులు చేయించి వినియోగంలో తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ దృష్టికి తీసుకెళ్లగా భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

- న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

గుంతల దారిలో ప్రమాదాలు

బత్తలపల్లి మండలంలోని మాల్యవంతంలో ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో వాహన చోదకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇది వరకే చాలా మంది ద్విచక్రవాహన చోదకులు కిందపడిన గాయపడ్డారని గ్రామస్థులు తెలిపారు. రోజూ ఈ రహదారిలో వందల సంఖ్యలో వాహనాలు తాడిపత్రి, కదిరి వెళ్తుంటాయి. వెంటనే గుంతలు పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బత్తలపల్లి





దుకాణాల ముందు వ్యర్థాలు.. వ్యాపారులకు కష్టాలు

ధర్మవరంలోని సంతమార్కెట్‌లో వారం రోజులకిందట విద్యుత్తు తీగలు చెట్లకు తగులుతున్నాయని విద్యుత్తు శాఖ సిబ్బంది వాటిని తొలగించారు. తొలగించిన చెట్ల కొమ్మలను మార్కెట్‌లోని దుకాణాల ముందు వేయడంతో అవి ఎండిపోయి చెత్త గుట్టగా మారింది. మున్సిపల్ సిబ్బంది వాటిని తీసివేయకపోవడంతో వ్యాపారాలకు అడ్డంకిగా మారిందని కూరగాయల యజమానులు వాపోతున్నారు. దుకాణాల ముందు ఇలా ఉండటంతో వ్యాపారం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శానిటేషన్ అధికారి కేశవ మాట్లాడుతూ చెత్త తొలగింపచేస్తామన్నారు. - న్యూస్‌టుడే, ధర్మవరం

నిలువెత్తు నిర్లక్ష్యం



కదిరి పట్టణ పరిధిలోని సైదాపురం సమీపాన ప్రధాన విద్యుత్తు లైన్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకున్నాయి. స్తంభాన్ని చుట్టేస్తూ పైకి పాకాయి. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో నేల చిత్తడిగా మారింది. చుట్టూ మొక్కలు పెరిగిపోవడంతో స్తంభానికి అల్లుకున్న తీగలు ముట్టుకుంటే షాక్ కొడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల విద్యుత్తు సిబ్బందికే వచ్చి షాక్ తగులుతోందని వెనక్కు వెళ్లి నట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్తు ఏఈ చెన్నకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటికే స్తంభానికి తీగలు తొలగించాలని సిబ్బందికి చెప్పామన్నారు. తక్షణం తీగలను తొలగించి ప్రమాదాన్ని నివారిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కదిరి

ఏమరపాటుగా వెళ్తే ముప్పే!



ముదిగుబ్బ మండలంలోని కృష్ణాపురం క్రాస్ నుంచి బుక్కపట్నంలోని మారాలకు వెళ్లే మార్గంలో నల్లచెర్లోపల్లి దగ్గర ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే పాతబడిన బావి ఉండటంతో గతంలో నిర్మించిన రక్షణ దిమ్మె పూర్తిగా శిథిలమై రూపు కోల్పోయింది. ఇరుకు దారి కావడంతో ఇదే మార్గంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళ ద్విచక్ర వాహనాల చోదకులు ఏమాత్రం ఏమరపాటుగా వెళ్లినా బావిలోకి దూసుకెళ్లే ప్రమాదముంది. గ్రామస్థులు శిథిలమైన కల్వర్టు దగ్గర ప్రమాదాలు జరగకుండా రాళ్లుఉన్నాగాయిట్ కర్రలు పాతారు. వర్షాలకు పచ్చిగడ్డి పెరిగి పాతబడ్డ బావి చోదకులకు కనిపించడం లేదు. - న్యూస్‌టుడే, ముదిగుబ్బ